క్లుప్తంగా

పారిజాతగిరిలో పూజలు


ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: స్థానిక పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం నాలుగో శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. అయ్యప్ప స్వాములు, భవానీలు, గోవింద స్వాములు విశేష సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. కాలినడకన వచ్చిన భక్తులు స్వామివారి అష్టోత్తర పూజలు, ప్రత్యేక దర్శనాలు చేసుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో మాణికల రాంబాబు భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు. కూరాకుల ఏడుకొండలు, హనుమాయమ్మ కుటుంబ సభ్యులు అన్నప్రసాద వితరణ దాతలుగా వ్యవహరించారు.

ఘనంగా సత్యసాయి జయంతి


సత్యసాయి మందిరం వద్ద అన్నసమారాధన

కొయ్యలగూడెం: భగవాన్ సత్యసాయి బాబా 99వ జయంతి మహోత్సవాలు శనివారం సత్యసాయి నగర్‌లో ఘనంగా నిర్వహించారు. సత్యసాయి మందిరం వద్ద తెల్లవారుజామున ఓంకార సుప్రభాత నగర్ సంకీర్తనతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం సామూహిక సత్యసాయి వ్రతాలు, గీతా పారాయణ మధ్యాహ్నం నుంచి అన్నసమారాధన, సాయంత్రం స్వామివారి చిత్రపటాలతో పాదుకా పల్లకీ ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో 200 మందికి పైగా భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు


క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కామవరపుకోట: రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత రాజ్యాంగంపై శనివారం క్విజ్ పోటీలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు ఉమ్మడి భీమరాజు తెలిపారు. భారత రాజ్యాంగం నిర్మాత బీఆర్ అంబేద్కర్ అంశంపై మండలస్థాయిలో జరిగిన క్విజ్ పోటీల్లో కామవరపుకోట, ఆడమిల్లి రావికంపాడు, యడవల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 78 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు భారత రాజ్యాంగం దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామని తెలిపారు.

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న గోపిమూర్తి

చింతలపూడి: తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పీడీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి బి.గోపిమూర్తి శనివారం చింతలపూడి మండలంలోని ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులను కలిశారు. డిసెంబర్ 5న జరిగే ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఆయన వెంట జిల్లా కార్యదర్శి పూరేటి శ్రీనివాసరావు, మండల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాభావం కలిగి ఉండాలి


భోజన సామగ్రి పంపిణీ చేసిన దృశ్యం

కొయ్యలగూడెం: విద్యార్థులు సేవాభావం కలిగి ఉండాలని స్థానిక 9వ వార్డు ఎంపీపీ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు ఎస్ఎస్ఆర్ ప్రసాద్ అన్నారు. పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థి బేతా అన్న పుట్టినరోజు సందర్భంగా తాను దాచుకున్న డబ్బులతో 30 మంది విద్యార్థులకు స్టీలు కంచాలు, గ్లాసులను అందించింది. ఈ సందర్భంగా విద్యార్థిని అన్న సేవా దృక్పథాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో బేతా కుమారి, ఉపాధ్యాయురాలు బిందు రాణి పాల్గొన్నారు.

కియోస్క్ సేవలకు ఇక సెలవేనా!

- ఆర్‌బీకేల్లో నిరుపయోగంగా కియోస్క్ యంత్ర పరికరాలు
- కియోస్క్ స్థానంలో పీఎంఏఐడీ యాప్ ఏర్పాటు
- కొత్త యాప్‌తో అరకొరగా సేవలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు

బుట్టాయగూడెం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, కార్యక్రమాలను నీరుగార్చేందుకు కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఇప్పటికే గత ప్రభుత్వంలో అమలు చేసిన పలు పథకాలను రద్దు చేస్తుండగా, మరి కొన్నింటిని పేర్లు మార్చివేస్తుంది. గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా సచివాలయం, రైతు సంక్షేమమే ధ్యేయంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రం సేవలను సైతం ప్రస్తుత ప్రభుత్వం నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది. ముఖ్యంగా రైతులకు వారి ఊరిలోనే నాణ్యమైన విత్తనాలు, ఎరువులతోపాటు వారికి అవసరమైన సేవలు అందించేందుకు జగన్ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో రైతులకు తమకు కావాల్సిన వ్యవసాయ సేవలను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసేందుకు వీలుగా కియోస్క్ యంత్రాలను ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసింది. అయితే ప్రస్తుతం కియోస్క్‌లు ఆర్‌బీకేల్లో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. రైతులకు కావాల్సిన ఎరువులు, యంత్ర పరికరాలు, పశువుల దాణా, మార్కెటింగ్ వంటి అన్ని రకాల సేవలను ఆన్‌లైన్‌లో పొందేందుకు గత ప్రభుత్వం కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేశారు. అలాగే ఈ యంత్రాల ద్వారా రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, యంత్ర పరికరాలను ఆన్‌లైన్‌లోనే ముందుగానే నమోదు చేసుకునే వారు. ఆయా ప్రాంతాల్లో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు, వ్యవసాయ పంటల యాజమాన్య పద్ధతులపై సమాచారం వీడియోల రూపంలో తెలుసుకునే వారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రభుత్వ సర్వర్లు పనిచేయకపోవడంతోపాటు సచివాలయ సేవలు ఒక్కొక్కటిగా నిలిచిపోతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

నియోజకవర్గంలో 107 ఆర్‌బీకేలు

పోలవరం నియోజకవర్గంలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు, టి.నర్సాపురం, కొయ్యలగూడెం మండలాల పరిధిలో గత ప్రభుత్వం 107 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ ఆర్‌బీకేల్లో 107 కియోస్క్ యంత్ర పరికరాలను రైతులకు సేవలందించేలా ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఆర్‌బీకేల్లో ఉన్న ఈ పరికరాలు కేవలం ఎరువుల అమ్మకాలకు మాత్రమే ఉపయోగిస్తూ మిగిలిన సేవలకు దూరంగా ఉంటున్నాయి. అయితే అధికారులు మాత్రం వాటిని వినియోగిస్తున్నామని చెబుతున్నారు.

పీఎంఏఐడీ యాప్ ఏర్పాటు

రైతుభరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన కియోస్క్ పరికరాల స్థానంలో పీఎంఏఐడీ యాప్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనివల్ల అరకొర సేవలు మాత్రమే అందుతున్నాయని రైతులు చెబుతున్నారు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాలను నిరుపయోగంగా ఉంచడం సరికాదని, ఆ యంత్రాల్లో గతంలో మాదిరిగానే పూర్తిస్థాయిలో సేవలందించాలని రైతులు కోరుతున్నారు.


ఆర్‌బీకేలో నిరుపయోగంగా ఉన్న కియోస్క్ యంత్రం

కియోస్క్ సేవలు కొనసాగించాలి



రైతు సంక్షేమానికి గత ప్రభుత్వం ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్ర సేవలు కొనసాగించాలి. ఎరువులు, పురుగుమందులు నమోదుతోపాటు మార్కెటింగ్ సౌకర్యాలను తెలుసుకునేందుకు కియోస్క్ యంత్రాలు ఎంతగానో ఉపయోగపడేవి.

– తెల్లం భీమరాజు, రైతు, దుద్దుకూరు, బుట్టాయగూడెం మండలం

సేవలు కొనసాగుతున్నాయి



ఆర్‌బీకేల్లో ఉన్న కియోస్క్ సేవలు వినియోగిస్తున్నాం. రైతులకు అన్ని రకాల సేవలు అందిస్తున్నాం. ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా సేవలందించేలా కృషి చేస్తున్నాం.

– బి. సుమలత, ఏఓ, టి.నర్సాపురం మండలం

పీఎంఏఐడీ యాప్ ఏర్పాటు



కియోస్క్ యంత్ర పరికరాన్ని ఎరువుల అమ్మకంలో వినియోగిస్తున్నాం. అయితే ప్రస్తుతం వాటి స్థానంలో పీఎంఏఐడీ యాప్ అందుబాటులోకి వచ్చింది. ఈ యాప్‌లో పురుగుమందులు, ఎరువులు, ఇతర వివరాలను నమోదు చేస్తున్నాం.

– డి.ముత్యాలరావు, ఏఓ, బుట్టాయగూడెం మండలం

మహిళపై కేసు నమోదు

కుక్కునూరు: బెల్టుషాపు నిర్వహిస్తున్న ఓ మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ ఎస్సై జి వెంకటలక్ష్మి తెలిపిన వివరాలివి. కొండపల్లి గ్రామంలో శనివారం ఎక్సైజ్ దాడులు నిర్వహించారు. మద్యం విక్రయిస్తున్న మహిళను అదుపులోకి తీసుకుని, ఆమె వద్ద నుంచి 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎం నిరసన

బుట్టాయగూడెం: అదానీని అరెస్ట్ చేయాలని కోరుతూ బుట్టాయగూడెంలో సీపీఎం ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడిన అదానీని తక్షణమే అరెస్ట్ చేయాలన్నారు. అదేవిధంగా ఆదానీ గ్రూప్‌తో ప్రభుత్వం చేసుకున్న విద్యుత్, అన్ని రకాల ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కారం భాస్కరరావు, అందుగుల ఫ్రాన్సిస్, పోలోజు నాగేశ్వరరావు, తామా ముత్యాలమ్మ, చంద్రు బుల్లెమ్మ, పి. శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరు: అదానీని అరెస్ట్ చేయాలని కోరుతూ శనివారం సీపీఎం ఆధ్వర్యంలో కుక్కునూరు ప్రధాన సెంటర్‌లో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి భయ్యాన శ్రీను మాట్లాడుతూ అదానీ గ్రూపుతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి నాగేంద్రరావు, మండల కమిటీ సభ్యులు యర్నం సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ద్వారానే పిల్లలను దత్తత తీసుకోవాలి

కామవరపుకోట: పిల్లలు లేని తల్లిదండ్రులు ప్రభుత్వం ద్వారానే పిల్లలను దత్తత తీసుకోవాలని జిల్లా శిశు గృహ మేనేజర్ కే భార్గవి అన్నారు. స్థానిక కమ్యూనిటీ హాల్‌లో దత్తత కార్యక్రమంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శిశు గృహ మేనేజర్ భార్గవి మాట్లాడుతూ 8 సంవత్సరాల నుండి 18 ఏళ్లలోపు తల్లిదండ్రులు లేని పిల్లలను పోస్టర్ కేర్ ద్వారా ప్రభుత్వం నుంచి దత్తత తీసుకోవాలన్నారు. పిల్లలను అక్రమంగా దత్తత తీసుకుంటే చట్టరీత్యా చర్యలు ఉంటాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ యూనిట్ సిబ్బంది పి.రాజేష్, వై.రాజేకుమార్, అంగన్‌వాడీ తడికలపూడి సెక్టార్ సూపర్‌వైజర్ నంబూరి వీరకుమారి ,గ్రామ మహిళా పోలీస్ పి.ప్రశాంతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


దత్తత అంశంపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా శిశు గృహ మేనేజర్ భార్గవి

మహిళా సాధికారతపై నిర్లక్ష్యం తగదు


కొయ్యలగూడెంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ విజయరాజు

డీఆర్‌డీఏ పీడీ విజయరాజు

కొయ్యలగూడెం: మహిళా సాధికారతపై నిర్లక్ష్యం తగదని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా పరిషత్ ఇన్‌చార్జి సీఈఓ ఆర్ విజయ్‌రాజు పేర్కొన్నారు. శనివారం కొయ్యలగూడెం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో జంగారెడ్డిగూడెం క్లస్టర్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను ఆర్థిక సాధికారత సాధించేలా చేయటానికి రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. స్త్రీ నిధి, ఉన్నతి పథకం, బ్యాంక్ లింకేజ్ ద్వారా మహిళలకు రుణాలు ఇప్పించాలని ఆదేశించారు. ఈ రుణాల ద్వారా యూనిట్లు తప్పనిసరిగా నెలకొల్పేలా చూడాలన్నారు. ఇందుకోసం నిర్దేశించిన లక్ష్యాలు ఎంతవరకు సాధించారనే విషయం సమీక్షిస్తూ వెనకబడిన మండలాల ఎంపీలను మందలించారు. లక్ష్యాలు సాధించకపోతే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. జిల్లా స్థాయి డీపీఎంలు సైతం తరచూ పర్యవేక్షించాలని సూచించారు. ఏలూరు జిల్లా రాష్ట్రంలో మొదటి వరసలో నిలవటానికి సమిష్టి కృషి అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఏడు మండలాల ఎంపీఎంలు, సీసీలు, కొయ్యలగూడెం మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, రాష్ట్ర స్త్రీ నిధి డైరెక్టర్ తోట కృపామణి, డీపీఎంలు చింతలపూడి సుబ్బారావు, అనిత, విజయకుమారి, రామోజీరావు, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన


మంజుశ్రీని సత్కరిస్తున్న సహాయ కమిషనర్ చందన

జంగారెడ్డిగూడెం రూరల్: కార్తీక మాసోత్సవాల్లో భాగంగా గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా నృత్య ప్రదర్శన చేసిన అయినవల్లి మంజుశ్రీని దేవస్థానం సహాయ కమిషనర్ ఆర్‌వీ చందన సత్కరించి, స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. కూచిపూడి, భరతనాట్యం వంటి కళలపై విద్యార్థి దశ నుంచే ఆసక్తి చూపాలని సహాయ కమిషనర్ చందన అన్నారు.

ఏపీటీఎఫ్ నాయకుల ప్రచారం

కుక్కునూరు: ఏపీటీఎఫ్ నాయకులు శనివారం మండలంలో ప్రచారం నిర్వహించారు. డిసెంబర్ 5న జరిగే ఉమ్మడి తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గంధం నారాయణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. కుక్కునూరు, చిరవెల్లి, అమరవరం, కేజీబీవీ, మాధవరం ఏహెచ్ఎస్ పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు.


మాధవరం పాఠశాలలో ప్రచారం చేస్తున్న ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి రెడ్డిదొర

సైబర్ నేరగాళ్లకు వృద్ధులే టార్గెట్

ఏలూరు (టూటౌన్): సైబర్ నేరగాళ్లు వృద్ధులనే టార్గెట్ చేస్తుండడంతో డిజిటల్ లావాదేవీల పట్ల జాగ్రత్తగా ఉండాలని డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ అన్నారు. ఏలూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా ఉన్న వృద్ధుల కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఏపీకే యాప్‌లు, మెసేజులు, లింకును ఓపెన్ చేస్తే ఖాతాదారుల రహస్య సమాచారం ఫొటోలు, బ్యాంక్ అకౌంట్లను హ్యాక్ చేస్తారని హెచ్చరించారు. బ్యాంక్ ఏటీఎం వద్ద వృద్ధులు పక్కవారి సాయం తీసుకునే సమయాల్లో జాగ్రత్తలు వహించాలన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930కి సమాచారం అందించాలని సూచించారు. త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, సైబర్ పోలీస్ స్టేషన్ ఎస్సై మధు వెంకట రాజా సోషల్ మీడియా అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వృద్ధుల సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రైతులకు మద్దతు ధరల గ్యారంటీ చట్టం తేవాలి



ఎం.నాగులపల్లిలో ఆందోళన చేస్తున్న రైతు సంఘ నాయకులు

ద్వారకాతిరుమల: రైతులకు మద్దతు ధరల గ్యారంటీ చట్టాన్ని తీసుకురావాలని, రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న ఏలూరు కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఎం.నాగులపల్లిలో శనివారం సాయంత్రం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు కరపత్రాలను పంపిణీ చేశారు. సంఘ జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. రైతులు పండించిన పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఉత్పత్తి ఖర్చుకు అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధరలు నిర్ణయించాలని కోరారు. రైతుల పంట రుణాలు మాఫీ చేయాలన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి, నిర్వాసితుల పునరావాసానికి పూర్తి నిధులు కేంద్ర ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్ని పంటలకు వర్తించేలా సమగ్ర పంటల బీమా పథకం తీసుకురావాలని కోరారు. పంటల బీమా ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే భరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

మహిళల భద్రత కోసం 'అభయ'

బుట్టాయగూడెం: సమాజంలో మహిళలపై జరుగుతున్న నేరాలను అదుపులోకి తీసుకువచ్చేందుకు ఎస్పీ కే. ప్రతాప్ శివకిశోర్ అభయ మహిళా భద్రతను ప్రవేశపెట్టిన్నట్లు ఎస్సై దుర్గామహేశ్వరరావు తెలిపారు. అభయ మహిళా భద్రతపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆపద సమయంలో ఎవరైనా డయల్ 112కు ఫోన్ ద్వారా సమాచారం అందించాలన్నారు. సమాచారం అందుకున్న 10 నిమిషాల్లోనే పోలీసు భద్రతను ఏర్పాటు చేస్తామని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాల్యవివాహాలకు ఎవరైనా పాల్పడితే 1098కు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ఆధునిక సమాజంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించే డిజిటల్ ట్రాన్సాక్షన్‌లకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో సైబర్ నేరాలకు పాల్పడే మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, స్థానిక పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.


కొమ్ముగూడెంలో సారా నిషేధంపై అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

నాటుసారా నిషేధంపై అవగాహన

పోలవరం: సారా తాగడం వలన తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో పాటు ఆర్థికంగా వారి కుటుంబాలు చితికిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కే.సత్యవతి అన్నారు. పోలవరం మండలం కొమ్ముగూడెం గ్రామంలో నాటుసారా నిషేధంపై ఎక్సైజ్ శాఖ అధికారులు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. నాటు సారా తయారీ, వినియోగం, విక్రయం పూర్తిగా నిషేధించాలని లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సారా తయారు చేసినా, విక్రయాలు జరిపినా సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్.శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆపద వస్తే.. ప్రాణాలకు నో గ్యారంటీ!

- ఏలూరు జీజీహెచ్‌లో అత్యవసర సేవలు నిల్
- స్టాంప్ ఉంటేనే స్కానింగ్, ఎంఆర్ఐ?
- గగ్గోలు పెడుతున్న ఏలూరు నగర జనం

ఏలూరు టౌన్: రోడ్డు ప్రమాదమో, అనారోగ్యంతో అత్యవసర స్థితి వస్తే, ఆపద పరిస్థితుల్లో పేదలకు వైద్య చికిత్స అందే అవకాశం లేదు. ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు, చికిత్సలు అందుబాటులోకి వస్తాయనే ఆశలపై నీళ్లు చల్లుతున్నారు. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో అత్యవసర సేవలు అందటం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే ప్రతి రోజూ ప్రాణాపాయ స్థితిలోని రోగులను విజయవాడ, గుంటూరుకు రిఫర్ చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. ఇక తాజాగా వైద్య నిపుణులను సైతం బదిలీ చేయటంతో పరిస్థితి మరింత క్లిష్టతరంగా మారే దుస్థితి ఏర్పడింది. ఏలూరు జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారిస్తే తప్ప ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందే అవకాశం లేదని రోగులు వాపోతున్నారు.


ఏలూరు జీజీహెచ్ అత్యవసర సేవల విభాగం (ఫైల్)

భర్తీకాని వైద్య నిపుణుల పోస్టులు

ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా బోధనాసుపత్రిని అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. ఏలూరు జీజీహెచ్‌లో మొత్తంగా 78 మంది ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సూపర్ స్పెషాలిటీకి సంబంధించి ఆయా విభాగాలకు వైద్య నిపుణులను నియమించాల్సి ఉంది. కానీ ప్రస్తుతం 38 మంది మాత్రమే వైద్యులు పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను కాపాడుకునే అవకాశాలు లేకపోవటంతో ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు జీజీహెచ్‌లో ట్రామాకేర్, ఐసీయూల్లో వైద్య నిపుణులు లేకపోవటంతో పరిస్థితి మరింత విషమంగా మారింది. రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు అత్యవసర వైద్య చికిత్సలు అందించేందుకు న్యూరోసర్జన్లు ఉండాలి. కానీ ప్రస్తుతం పనిచేస్తున్న న్యూరో సర్జన్ బి.రవికుమార్‌ను అధికారులు బదిలీ చేశారు. గుండెపోటు వస్తే ప్రైవేటు హాస్పిటల్‌కు వెళ్లటం తప్ప మరో దారిలేదు. కార్డియాలజీ వైద్య పోస్టును భర్తీ చేయలేదు. యూరాలజీ వైద్య నిపుణులను సైతం ఏర్పాటు చేయకపోవటంతో ప్రజల ప్రాణాలకు భరోసా లేకుండా పోయింది.

స్కానింగ్, ఎంఆర్ఐపై అసంతృప్తి

ఏలూరు నగర ప్రజలు అనారోగ్యంతో జీజీహెచ్‌కు వెళితే స్కానింగ్, ఎంఆర్ఐ పరీక్షలకు ప్రజాప్రతినిధులు నియమించిన వ్యక్తుల సిఫార్సు కావాలంటూ సిబ్బంది చెప్పటం గమనార్హం. ఇటీవల నగరానికి చెందిన ఒక వ్యక్తి తీవ్ర అనారోగ్యంతో జీజీహెచ్‌కు వెళ్లగా వైద్యులు స్కానింగ్ తీయించుకోవాలని రాశారు. ఓపీ చీటీ తీసుకుని స్కానింగ్ సెంటర్‌కు వెళ్లగా దీనిపై ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధి స్టాంప్ లేదని, స్కానింగ్ తీయకపోవడంతో రోగి బంధువులు అవాక్కయ్యారు. సరేలే అంటూ సదరు ప్రతినిధి కోసం ఆరా తీస్తే, ఆయన లేరని తెలిసింది. సిబ్బంది మాటలతో రోగుల బంధువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా న్యూరో సర్జన్ రవికుమార్, జనరల్ ఫిజీషియన్ పోతుమూడి శ్రీనివాసరావు సైతం బదిలీ కావటంతో రోగుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది.

చికిత్సలు అందించడంలో విఫలం



ఏలూరు సర్వజన ఆసుపత్రిని అభివృద్ధి చేయటంతో పాటు, సామాన్య, మధ్యతరగతి వర్గాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలి. అత్యవసర సేవలకు సంబంధించి నిపుణులైన వైద్యులను నియమించటం, ప్రతి వ్యక్తికీ ఉత్తమ వైద్య చికిత్స అందించేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. స్కానింగ్, ఎంఆర్ఐ వంటి పరీక్షలకు ప్రైవేటు స్కానింగ్ సెంటర్లకెళ్లి భారీగా డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి ఉంది. సామాన్య వర్గాల ప్రజలకు ఉచితంగా వైద్య చికిత్సలు, శస్త్ర చికిత్సలు అందించటంలో కూటమి ప్రభుత్వం విఫలం అవుతుందనే అభిప్రాయం ప్రజల్లో ఉంది.

– మామిళ్లపల్లి జయప్రకాష్, వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త

వైద్యానికి అప్పు చేయాలి



ఏలూరు బోధనాసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్య నిపుణుల పోస్టులు భర్తీ చేయాలి. ఏలూరు నగరం, పరిసర ప్రాంతాల ప్రజలకు ఏలూరు జీజీహెచ్‌లో మెరుగైన వైద్యసేవలు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలి. గుండె సంబంధిత వైద్య నిపుణులు లేరు. ప్రాణాపాయ స్థితిలో విజయవాడ, గుంటూరు వంటి దూరప్రాంతాలకు వెళ్లటం ఖర్చుతో కూడింది. ప్రైవేటు హాస్పిటల్స్ తీసుకువెళ్లటానికి సామాన్య ప్రజలు అప్పులు చేయాలి. ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి ఏలూరు జీజీహెచ్‌లో వైద్యుల పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– ప్రత్తిపాటి తంబి, న్యాయవాది, ఏలూరు